థీసిస్ అంటే తీసివేసేది(సంగ్రహించేది) అని ఒక చమత్కారం 'ఎత్తిపోతల పథకం' అని ఒక విసురు. "పరిశోధనలు 'ఉపరి' శోధనలవుతున్నాయి" అని చురక. – ఇలా తెలుగులో సిద్ధాంత గ్రంథాల మీద చాల హాస్యోక్తులూ వ్యంగ్యోక్తులూ ఉన్నాయి. వీటికి ఉదాహరణప్రాయమైనవి కూడా ఉన్నాయి. అయితే అప్పుడప్పుడు పై ఉక్తులకి అపవాదంగా కొన్ని సిద్ధాంత గ్రంథాలు వస్తూంటాయి. ఇటువంటివాటికి చెందినదే డా॥ కె.వి.రమణాచారి సిద్ధాంత గ్రంథం "పద్యకవిత్వం – వస్తు వైవిధ్యం".

ఆధునిక సాహిత్య రంగంలో కవులు చాలామంది సాహిత్యంలో డిగ్రీలున్నవారు కాదు– మహా మహోపాధ్యాయులూ కాదు. వృత్తి వేరైనా సాహిత్యమే ప్రవృత్తిగా కలవారు ఎక్కువగా ఉన్నారు. ఈ విషయాన్ని రమణాచారి ఈ పుస్తకంలో ప్రత్యేకంగా పేర్కొన్నారు కూడా. అసలు విశేషం ఏమిటంటే– రమణాచారి కూడా రసాయన శాస్త్రం చదువుకున్నవారు– ఐ.ఏ.ఎస్. కూడా. నిత్యం పరిపాలనలో మునిగి (అప్పుడప్పుడు మునిగితేలుతూ) ఉన్నవారు. ఇటువంటివారు ఆ పండిత కుటుంబానికి చెందడం వల్ల, సాహిత్య కళా రంగాల పట్ల సహజంగా అభినివేశం, అభిలాష ఉండటం వల్ల ఇంత మంచి పరిశోధన గ్రంథం రచించారు.

నాకు మొట్టమొదటగా నచ్చిన అంశం ఏమిటంటే మూస పద్ధతిలో– పద్యమనగా, కవిత్వమనగా–అంటూ వేదాల నుంచి మొదలెట్టకుండా నేరుగా వస్తువుతో మొదలెట్టడం!

రెండవ అంశం– వస్తు వర్గీకరణ వివరంగా, సమంజసంగా వుండటం. మూడవ అంశం– వస్తు సేకరణలో అద్వితీయమైన కృషి. "పద్య కవిత్వం–వస్తు వైవిధ్యం" అనే సిద్ధాంత గ్రంథం బాగా పరిశీలిస్తే–

పద్యాల నడుము విరగలేదనీ

పద్యం మ్యూజియంలో పెట్టవలసిన వస్తువు కాదనీ

ఆధునికతకి పద్యం కూడా వాహికే అనీ

తెలుస్తుంది. ఇన్ని పద్యకావ్యాలూ, శతకాలూ వచ్చాయా?? ఇంతటి సమకాలీన స్పృహతో పద్యాలు వచ్చాయా?? అని ఆశ్చర్యపోవటం కొందరికి తప్పదు.

'వస్తుతత్వ విచారం' అనే మొదటి అధ్యాయం టూకీగా పరిచయం చేస్తుంది. రెండవ అధ్యాయం నుంచే రమణాచారి విజృంభణ కనిపిస్తుంది. ఆధ్యాత్మికం, పౌరాణికం, చారిత్రకం, సామాజికం అనే విభాగాలుగా పద్య కవిత్వంలోని వస్తు వైవిధ్యం విస్తరించింది. "నిరంతర సాధనతో, అధ్యయనశీలంతో మరింత ఉత్తమంగా పద్యకవితను కాని, వచన కవితను కాని వినూత్నమార్గంలో హితచింతన రీతిలో రచించే చాతుర్యాన్ని సంపాదించుకోవాలి" అని రచయిత అభిప్రాయం. అందువల్ల "ఈ సిద్ధాంత గ్రంథంలో పద్యకవిత బాగోగులపై చర్చలు, వాదోపవాదాలు పట్టించుకోలేదు" అని ముందే గిరి గీసుకున్నారు. నిజానికి బాగోగుల్ని కూడా పట్టించుకోవాలి. లేకపోతే పద్యకవిత్వమంతా గొప్పది, ఉత్తమమైనది అనే అపోహ ఏర్పడుతుంది. కేవలం ఛందస్సులో ఉన్నంత మాత్రాన కవిత్వం కాదు గదా! 1991–2000 దశాబ్దంలో వెలువడినవాటినే స్వీకరించడంవల్ల ఒక సమగ్రత, ఒక సాధికారిత ఏర్పడింది. "నా దృష్టికి రాని కవితా సంకలనాలు ఇంకెన్ని ఉన్నాయో" అనటం పరిశోధకుని చిత్తశుద్ధిని వెల్లడిస్తుంది.

మామిడన్న సత్యనారాయణమూర్తి, అద్దంకి కేశవరావు, సామవేదం జానకిరామశర్మ, చోట్నేరు శ్రీరామమూర్తి, బూర్గుల రంగనాథరావు, లక్ష్మీప్రసాదబాబు, నేమాని రామజోగిసన్యాసిరావు వంటి ప్రతిభావంతులైన కవులు ప్రచారయుగంతో పోటీ పడలేకపోయారు. వీరి రచనల్ని, కవితా వైశిష్ట్యాన్ని రమణాచారి వివరించి వాళ్ళకి చరిత్రలో స్థానం కల్పించారు. పరవస్తు వెంకయసూరి చిన్నయసూరిపై రాసిన విశిష్ట కావ్యాన్ని పరిచయం చేస్తూ ఒక వ్యాకరణవేత్తను నాయకునిగా చేసి కావ్యం రాయటం తొలి ప్రయత్నమనడం సమంజసమే. మధునాపంతుల సత్యనారాయణశాస్త్రిపై కడిమిళ్ళ రాసిన "మధుజీవనం" పి.వి.నరసింహారావుపై మొవ్వ వృషాద్రిపతి రాసిన "భారతజ్యోతి" వంటి కావ్యాలను పరిచయం చేసిన పద్య కవిత్వంలోగల వైవిధ్యాన్ని ప్రదర్శించారు.

**"చిన్నదానవయ్యును మనసున్నదాన**
**వో ఉడుత! నీ సదాశయమున్నతిగనె**
**పరులకవ్యాజముగ సాయపడెడు వేళ**
**నిన్ను పేర్కొందురెల్లరు నిశ్చయముగ"**

అంటూ రామజోగి సన్యాసిరావు 'ఉడుత'పై రాసిన పద్యాలు మనల్ని స్పందిపంజేస్తాయి. రాళ్ళబండివారి "కాదంబిని", సంపత్కుమార "ఆముక్త", వేంకటేశ్వరస్వామి వారి వివిధ సేవలను విపులంగా వర్ణించిన వీరమల్లయ్య శతకం– ఇలా విశిష్ట, విలక్షణ రచనలెన్నో ఈ సిద్ధాంత గ్రంథంలో వున్నాయి. అయితే ఎందువల్లనో ఈ దశాబ్దంలో వెలువడిన ఉదాహరణ కావ్యాలను స్పృశించలేదు. సి.పి.బ్రౌన్‌పై వచ్చిన ఉదాహరణ కావ్యం చాలా గొప్పది.

స్మృతికవిత పాశ్చాత్య ప్రభావంతో వచ్చిందంటారు. మన పద్యకవులు కూడా స్మృతికవితకు ప్రాధాన్యమిచ్చారని ఈ పరిశోధన గ్రంథం తెలియజేస్తుంది.

**"ఎక్కడ పుట్టినావో కద! యిక్కడ మెట్టితి,**
**నిత్యసేవలన్**
**దిక్కును మొక్కులేని కడు దీనులనొక్కట**
**గూర్చి ప్రేమతో"**

అంటూ ఎస్.వి.రాఘవేంద్రరావు మదర్‌థెరీసాపై రాసిన స్మృతిపద్యాలు మనల్ని ఆర్ద్రం చేస్తాయి. ఇలా రమణాచారి మూల మూలనున్న పద్యాలను కూడా సేకరించి, వివరించి పరిశోధనాపటిమను వ్యక్తం చేశారు. పాడేటి జాన్సన్ రాసిన లఘుకృతి 'అమ్మ' విషాద మాధుర్యాన్ని పంచిపెడుతుంది. గరికపాటి సమకాలీనతను రమ్యంగా, ఆర్ద్రంగా, పకడ్బందీగా పద్యాలలో చొప్పించగల ప్రతిభామూర్తి. ఇందుకు ఒక సాక్ష్యం ఈ సిద్ధాంత గ్రంథంలో– వై2కె. గుండాబత్తుల నారాయణరావు "బ్రహ్మాస్త్రాలు" రాజకీయ రంగాన్ని 'ఏకి' వదిలిన కావ్యం. రమణాచారి రాజకీయ రంగ కవిత్వాన్ని సేకరించటంలోకంటే ఉత్తమమైనవి ఉదహరించటంలో మరీ శ్రద్ధ వహించారనిపిస్తుంది. శ్రీశ్రీ "కాదేదీ కవితకనర్హం" అంటూ చెప్పినవాటిలో శిష్టావారు వెక్కిరిస్తూ చెప్పిన పద్యం– వెక్కిరింపుకి యోగ్యమైనది. ఎందుకంటే కుక్కపిల్ల, సబ్బుబిళ్ల... వంటివాటిపై కవితలు, కథలు వచ్చాయి కాబట్టి! "ప్రయోగ వైవిధ్యం"లో ఛందస్సులో ప్రయోగాలు వివరించారు. అలాగే 'శిల్పం' గురించి కూడా ఒక అధ్యాయం వుంటే బాగుండేది. వస్తువుకీ శిల్పానికీ సంబంధం వుంది కదా! బాగోగులు గురించి పట్టించుకోలేదని అన్నారు కానీ– అక్కడక్కడ లేకపోలేదు. కసిరెడ్డి గురించి "ఈ శతకంలో పద్యశిల్పం కన్నా భారతీయ సనాతన ధర్మాన్ని రక్షించుకోవాలన్న సందేశం ప్రధానం" అనడం విమర్శే! వెలుదండ నిత్యానందరావు అన్నట్టు, యశోదారెడ్డి పీఠికలో అన్నట్టు– అని వివరించటం మరింత వన్నె తెచ్చింది. మొత్తంమీద ఆధునిక పద్య కవిత్వంపై ఇంచుమించుగా సమగ్ర పరిశీలన జరిపారు. పద్యకవిత్వంపై పరిశోధనలకు ఇది– సినారె సిద్ధాంత గ్రంథంలా– ఒక ఆకరం అవుతుందనడంలో సందేహం లేదు. రమణాచారికి, వారి పర్యవేక్షకులు ఎల్లూరి శివారెడ్డికి అభినందనలు.

# సంగీత కళాకారుల సమగ్ర చిత్రణ

రాయబడినట్టుగా కాక చెప్పబడినట్టుగా రాయడమన్నది అంత సులువైన విద్యేం కాదు. అలా రాయలేక వైఫల్యం చెందుతున్న తెలుగు కథా రచయితలెందరినో చూస్తున్నాం మనం. నిజానికి ఆ విధంగా రాయవలసిన అవసరం కథల విషయంలో ఉన్నంతగా వ్యాసాలవంటి కొన్ని ఇతర వచన రచనా ప్రక్రియల విషయంలో ఉండకపోవచ్చు. కాని ఒక విధంగా సంగీతాన్ని గురించిన వ్యాసాల సమాహారమనతగిన ఈ పుస్తకం('స్వరలయలు') లోని విషయాలు రాయబడినట్టుగా కాక చెప్పబడినట్టుగా వుండటం పెద్ద విశేషం. అంటే ఇవి ముచ్చట్లువలె ఉన్నాయన్నమాట. సదాశివగారు ఈ ముచ్చట్లు తెలుపుతూ రాసిన విధంగా రాయటమన్నది ఏ కొద్దిమంది వల్లనో తప్ప అందరివల్లా అయ్యే పని కాదు. ఇదీ ఈ పుస్తకంలో నేను గమనించిన గొప్పతనం. నా ఈ అభిప్రాయానికి దృష్టాంతం అన్నట్టుగా ఈ పుస్తక ప్రచురణకర్తలైన చెలిమి ఫౌండేషన్‌వారు రచయిత సదాశివగారి వచన రచనా సామర్థ్యం గురించి వివరిస్తూ "ఇంత చక్కని తెలుగు వచనం రాసే మరో రచయిత ఇప్పుడు లేడంటే అతిశయోక్తి కాదేమో" అని పేర్కొనడం విశేషం. ఈ పుస్తకం కన్న ముందు సదాశివగారు 'మలయమారుతాలు', 'సంగీత శిఖరాలు' అనే రెండు హిందుస్తానీ శాస్త్రీయ సంగీతాన్ని గురించిన పుస్తకాలను రాసి వున్నారు. అవి సంగీతప్రియులను అలరించాయి. మొదటి రెండింటివలెనే ఈ మూడవ పుస్తకంలో కూడా ఎక్కువ వరకు సంగీత కళాకారుల జీవితాలలోని సంఘటనలను పాఠకుల ముందుంచారు.

సదాశివగారి జ్ఞాపకశక్తి అపారమైనది, బహుధా ప్రశంసనీయమైనది. మహారత్నాకరం వంటి సంగీత రంగంలో సంగీత రత్నాలు అసంఖ్యాకం. పాత తరాలవాళ్ల నుండి ప్రస్తుత తరంవాళ్లవరకు చూస్తే వందలాదిగా మహనీయ కళాకారులుంటారు. వాళ్ల తలిదండ్రుల పేర్లు, సోదరీ సోదరుల పేర్లు, కుమారుల, కూతుళ్లపేర్లు, వాళ్ల జీవితకాలాల వ్యవధులు, ఎవరెవరికి ఏయే వయసులో గండాబంధనం జరిగిందీ, వివిధ సంగీత సభల్లో పాల్గొన్నప్పుడు ఎవరెవరికి ఎంతెంత వయసు వుండిందీ, ఏయేసంగీత సభలకు ఎవరెవరు ఉద్దండులు హాజరైందీ–ఇట్లాంటి విషయాలను గురించిన సమస్త వివరాలను కచ్చితంగా పేర్కొనడమన్నది ఎంతో జ్ఞాపకశక్తి వుంటే తప్ప సాధ్యమయ్యేపనికాదు. పైగా ఒకే పేరును కలిగినవాళ్లు వేర్వేరు ఘరానాల్లోవుంటే ఆ విషయాన్ని తెలియజేయడమేగాక వాళ్లకు సంబంధించిన వివరాలన్నిటినీ పేర్కొనడమన్నది సమాచారాన్ని పఠితలకు అందించడంపట్ల ఆయనకుగల శ్రద్ధను, నిబద్ధతను సూచిస్తుంది.

శాస్త్రీయ సంగీతం పట్ల సాధారణమైన (అంత సీరియస్ కాని) ఆసక్తిని కలిగిన సామాన్య సంగీత ప్రేమికులకు సంగీత కళాకారుల జీవిత విశేషాలపైనకంటె ఆ సంగీతాన్ని పరిచయం చేసే, దాని గురించిన అవగాహనను పెంచే విషయాల పట్లనే ఎక్కువ ఆసక్తి వుండటం సహజమే. అలాంటివాళ్లకు ఈ పుస్తకం కలిగించే సంతృప్తి అధిక పరిమాణంలో లేనట్టు అనిపించవచ్చు. అయితే ఈ పుస్తకంలో శాస్త్రీయ సంగీతాన్ని పరిచయం చేసే అంశాలు లేవని చెప్పలేం. నిజానికి ఇందులో నాలుగు పేజీలు ఠుమ్రీకి, అయిదు పేజీలు గజల్‌కు కేటాయించబడినవి. కానీ తక్కిన వ్యాసాలలో దాదాపు అన్నీ సంగీత కళాకారుల జీవితాలలోని సంఘటనలను, వ్యక్తిత్వ విశేషాలను గురించి రాసినవే. ఒక కళాకారుని కళను అతని వ్యక్తిత్వం నుండి వేరు చేసి బేరీజు వెయ్యటమన్నది అంత సమంజసమైన, అభిలషణీయమైన విషయం కాదన్నది రచయిత ఉద్దేశం అయివుండవచ్చు.

---

*స్వరలయలు –సదాశివ*

***పేజీలు: 170, వెల: రూ.150/-***

*ప్రతులకు:*

*నవోదయ బుక్ హౌస్*

*ఆర్యసమాజ్ మందిర్ ఎదురుగా*

*కాచిగూడ క్రాస్‌రోడ్స్*

*హైదరాబాద్– **500 027***

---




ఈ పుస్తకాన్ని చదివితే ఒకప్పటి సంగీత దిగ్గజాలు ఆ ఉన్నత స్థాయిని చేరుకోవడం కోసం పడిన ఇబ్బందులు, కఠోర పరిశ్రమ, ప్రయాస, వారి నిబద్ధత, వాళ్ల వ్యక్తిత్వాలలోని వివిధ పార్శ్వాలు క్షుణ్ణంగా తెలుస్తాయి. ధనార్జన వాళ్ల ప్రధాన లక్ష్యం కాకపోవటం ముచ్చట గొలుపుతుంది. తలచుకుంటే లక్షల రూపాయలు సంపాదించగలిగివుండి కూడా తమ నియమాన్ని వీడక ధనాన్ని తృణప్రాయంగా తిరస్కరించడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. కానీ ఒక విధంగా ఆలోచించి చూస్తే ఇందులో అంతగా ఆశ్చర్యపడవలసిందేమీ లేదేమో. ఎందుకంటే ఆ విధంగా డబ్బు సంపాదన పట్ల వాళ్లకు నిరాసక్తత లేకపోయివుంటే వాళ్లు సంగీత రంగంలో అంతటి ఉన్నత స్థానాలకు చేరలేకపోయేవాళ్లు కావచ్చు! అదేవిధంగా ఆ రోజుల్లో కళాపోషకులు ఎంతటి గాఢమైన కళాతృష్ణ కలిగివుండేవాళ్లో ఈ పుస్తకంలో చక్కగా తెలుపబడింది. ఇక కళాకారుల గాయన సామర్థ్యం గురించి రాసింది చదివితే కొన్నిచోట్ల మనసు అనిర్వచనీయమైన ఉద్వేగానికి లోనై నయనాలు అశ్రుపూరితలావుతాయి. సాధారణంగా మనకు తెలియని ఆసక్తికరమైన విషయాలెన్నో ఈ పుస్తకంలో పొందుపరచబడినాయి. బొంబాయిలో స్వరశ్రీ కేసర్‌బాయి కేర్కర్ తన అనుచర మిత్రబృందం (Coterie) మధ్యన కూర్చుని మాట్లాడుతున్నప్పుడు గణపతిరావు కులకర్ణి ధోండూతాయి కులకర్ణిని మొదటిసారిగా పరిచయం చేసి ఆమెకు సంగీతం నేర్పవలసిందిగా అభ్యర్థించినప్పుడు స్వరశ్రీ అహంకారపూరితంగా మాట్లాడిన విధానం దిగ్భ్రాంతిని కలిగిస్తుంది. ఇప్పుడు కూడా పిన్నవయస్కుడని పించే సంజీవ్ అభయంకర్ గాత్రాన్ని విదుషి హీరాబాయి బరోడేకర్ ఆ రోజుల్లోనే మూడు సార్లు విని ప్రశంసించడం మరొక విషయం. ఉస్తాద్ అబ్దుల్ కరీంఖాన్ సాహెబ్ మద్రాసు వెళ్లినప్పుడు తరచుగా చిత్తూరు వి.నాగయ్య గారింట్లో బస చేయడం, భారతరత్న పండిత్‌భీమ్‌సేన్‌జోషికి అతి వేగంగా కారు నడపడం ఒక హాబీ అనే విషయం, ఉస్తాద్ బడేగులామలీఖాన్ పీపాలకొద్ది నెయ్యిని ఇంట్లో వుంచుకుని దానితో వంటలు చేయడం, చేయించుకోవడం, ఆయన తరచుగా హిందీ సినిమా పాటలను (ఎక్కువగా లతామంగేష్కర్ పాడినవి) వినడం, సురేశ్‌బాబుమానె పాదరసాన్ని ఉపయోగించి బంగారం తయారుచేసే విద్య పట్ల ఆకర్షితుడై సంగీతాన్ని నిర్లక్ష్యం చేయడం– ఇట్లాంటి కొన్ని గమ్మత్తైన, కొంచెం విస్మయకరమైన విషయాలు తెలుస్తయ్ ఈ పుస్తకం చదివితే.

గొప్ప కళాకారుల గుణగణాలలోని ప్రతికూలాంశాలను ప్రస్తావించినా వాళ్ల ప్రతిభలోని మహత్తును పేర్కొనడంలో ఎలాంటి అశ్రద్ధ చేయకపోవడం రచయిత చూపించిన నిష్పాక్షిక దృష్టిని తెలియజేస్తుంది. ఉదాహరణకు స్వరశ్రీ కేసర్‌బాయి కేర్కర్ విషయాన్నే తీసు కోవచ్చు. గొప్ప కళాప్రతిభ వుండి కూడా కొందరు తమ కుటుంబం కోసం త్యాగం చేసిన కారణంగా, మరికొందరికి పరిస్థితులు అను కూలించక సంగీత రంగంలో ఉన్నత స్థానాన్ని ధిరోహించలేక అనామకులుగా మిగిలిపోయిన విషయం తెలుసుకుని బాధపడతాం.

హిందుస్తానీ శాస్త్రీయ సంగీత కళాకారుల గురించి, ఆ సంగీతం గురించి ఇంత విస్తారంగా, విలక్షణంగా రాసిన తెలుగు రచయితలు లేరనటంలో అతిశయోక్తి లేదు. 'మలయమారుతాలు', 'సంగీత శిఖరాలు', 'స్వరలయలు' అనే ఈ మూడు పుస్తకాలను సదాశివగారు రచించి వుండకపోతే తెలుగు వాళ్లైన సంగీత ప్రేమికులకు హిందుస్తానీ శాస్త్రీయ సంగీత కళాకారుల గురించి, ఆ సంగీతం గురించి ఇంత అధికంగా, ఇంత సులభంగా తెలుసుకునే అవకాశం దొరికి వుండేది కాదేమో. ఆ విధంగా ఈ మూడు పుస్తకాలను రాయటం ద్వారా సదాశివగారు మనందరికి ఎనలేని ఉపకారం చేసినారనటంలో ఎటువంటి సందేహం లేదు.

– ఎలనాగ